సాక్షి జగిత్యాల

మంగళవారం ❘ 12 ❘ మార్చి ❘ 2024



మత్తుతో జీవితాలు నాశనం

జగిత్యాలజోన్: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జగిత్యాల స్పెషల్ సబ్ జైల్లో ఖైదీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:24	బుధ 4:57

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రకృతి వైపరీత్యాలపై ఎన్డీఆర్ఎఫ్ అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలనే అనే అంశంపై ఎన్డీఆర్ఎఫ్ దళం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం ఆయా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టం జరగకుండా సహకరించడం.. ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నదానిపై అవగాహన ఇస్తారని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈనెల 18 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12న ధర్మపురిలో, 14న వెల్గటూర్ గోదావరి పరీవాహకప్రాంతం పరిశీలన, 15న కలెక్టరేట్‌లో యువతకు అవగాహన, 16న రాయికల్‌లో, 17న బీర్‌పూర్‌లో, 18న మొక్కల ప్లాంటేషన్ ఉంటుందని వివరించారు. అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌సెక్టర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.11.94 లక్షలు

పెగడపల్లి: పెగడపల్లిలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని ఆలయ ఆవరణలో సోమవారం లెక్కించారు. శివరాత్రి సందర్భంగా నాలుగు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో రూ.11,94,298 ఆదాయం సమకూరింది. కొబ్బరికాయలు, బెల్లం, లడ్డూ, పులిహోర, కంకణాల ద్వారా రూ.3,22,464, టికెట్ల ద్వారా రూ.2,75,261, చందాలు, కానుకల ద్వారా రూ.3,44,794, హుండీ ద్వారా రూ.2,51,719 సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, పోచయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జమున, మాజీ సర్పంచి శ్రీనివాస్, మాజీ చైర్మన్ కరుణాకర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆదాయం రూ.2.22లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురిలోని అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.2,22,400 నగదు, 1.5 గ్రాముల మిశ్రమ బంగారం, 3.35 గ్రాముల మిశ్రమ వెండి, 4 విదేశీ నోట్లు వచ్చినట్లు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, సభ్యులు గంగారెడ్డి, రాజయ్య, గొట్టల లక్ష్మి, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, గడ్డం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

గడువులోపు సీఎంఆర్ చెల్లించాలి

జగిత్యాల: మే 15లోపు సీఎంఆర్ చెల్లించేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని, నిర్దేశించిన గడువులోపు చెల్లించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. రోజువారి లక్ష్యం ప్రకారం మిల్లుల నుంచి సీఎంఆర్ చెల్లించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

అదే హడావుడి..!

- ధరణిలో పెండింగ్ క్లియరెన్స్ తంతు
- గత ప్రభుత్వంలోనూ ఇలాగే..
- సమస్యలు పరిష్కారమయ్యేనా..?
- ఇచ్చిన సమయం తక్కువే..



ఇబ్రహీంపట్నంలో ధరణి క్లియరెన్స్‌ను పరిశీలిస్తున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

కోరుట్ల: సుమారు ఎనిమిదేళ్ల క్రితం.. పహాణీల్లో ఉన్న సమాచారాన్ని అప్పటి ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్‌లో కంప్యూటరీకరణకు రెవెన్యూ యంత్రాంగం ఎక్కడాలేని హడావుడితో పనిచేసింది. ఫలితంగా కొన్ని తప్పులకు ఆస్కారం ఏర్పడింది. ఆ తప్పులను సరిదిద్దుకోవడానికే జనం నానా తంటాలు పడ్డారు. పైగా ధరణి పోర్టల్ మాడ్యూల్స్‌లో అవసరమైన మార్పులు, చేర్పులు లేకపోవడం సమస్యలకు కారణమైంది. భూ రికార్డుల వివరాలు కంప్యూటరీకరణతో సమస్యలు సమసిపోతాయని ప్రభుత్వం భావించినా అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలో జనం రికార్డుల సవరణ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

అప్పుడు రోజువారీ టార్గెట్లు..

2016–2017లో జిల్లాలోని అన్ని భూ రికార్డులను కంప్యూటరీకరించి ధరణి పోర్టల్‌లో చేర్చే క్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ రోజువారీ టార్గెట్లు ఫిక్స్ చేశారు. ప్రతిరోజూ తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల వివరాలు ధరణిలో నమోదు అవుతున్న తీరును పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిళ్ల నేపథ్యంలో కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో సరైన రీతిలో పరిశీలన చేయకుండానే కంప్యూటరీకరణకు సిద్ధమయ్యారు. మండలాలవారీగా భూరికార్డులు కంప్యూటరీకరణ ఎక్కువ శాతం పూర్తి చేసినట్లు చూపి ఉన్నతాధికారుల మెప్పు పొందేందుకు కొంత మంది తహసీల్దార్లు తాపత్రయపడ్డారు. ఆ సమయంలో నెల రోజులకు మించి జగిత్యాల డివిజన్‌లోని లక్షలాది భూముల సర్వే నంబర్లు.. పట్టాదారుల వివరాల కంప్యూటరీకరణ కార్యక్రమం మొదట మందకొడిగా సాగినా.. తరువాత అధికారుల ఒత్తిడితో హడావుడిగా ముగించారు.

కుప్పలుగా తప్పులు..


క్షేత్రస్థాయిలో ధరణి రికార్డుల సావధానంగా, సవ్యంగా నమోదుకు అవకాశం లేకపోవడంతో కిందిస్థాయి రెవెన్యూ పని పూర్తిచేయాలన్న ధ్యాసతో తప్పుల తడకగా రికార్డులు తయారుచేశారు. ధరణిలోని పట్టాదారులకు సంబంధించిన వివరాలు సరిగా నమోదు కాకపోవడం.. ఆధార్ కార్డుల అనుసంధానంలో ఒకరికి బదులుగా మరొకరి వివరాలు నమోదుకావడం జరిగింది. సర్వే నంబర్ల విస్తీర్ణం తప్పుగా నమోదు చేయడం, భూములు కొనుగోలు చేసి మోఖాపై ఉన్నవారి పేర్లు కాకుండా పహాణీల్లో ఉన్న పేర్లు యథాతథంగా నమోదు చేయడం.. కొన్ని సర్వేనంబర్ల వివరాలే నమోదు చేయకపోవడం వంటి అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కొంత మంది రెవెన్యూ సిబ్బంది కంప్యూటరీకరణ సాకుతో డబ్బులకు కక్కుర్తి పడి ఎలాంటి ఆధారాలూ లేకున్నా 'కాసులు' ఇచ్చిన వారి పేర్లు నమోదు చేయడం అనేక భూవివాదాలకు కారణమైంది. సుమారు 80 శాతం భూరికార్డుల వివరాలు సవ్యంగానే ఉన్నా మిగిలిన సర్వే నంబర్ల వివరాలు తప్పులతడకగా నమోదు కావడంతో చివరికి వాటిని సవరించుకోవడానికి పట్టాదార్లు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు.

ఇప్పుడూ అదే తంతు..

ఇటీవల ధరణి పెండింగ్ సమస్యల సత్వర క్లియరెన్స్ కోసం అధికార యంత్రాంగం ఈనెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా భూముల విలువ ఆధారంగా తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ వరకు మార్పులు, చేర్పులు చేసి సమస్యల పరిష్కారాని కి అవకాశం ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల వరకు ధరణి క్లియరెన్స్ కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. నెలల త రబడి క్లియరెన్స్‌కు నోచుకోని సమస్యలను పరి ష్కరించడానికి కేవలం తొమ్మిది రోజులు సమ యం ఇవ్వడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ పనుల పూర్తికి సిబ్బంది హడావుడి పడిన వైనం కనిపించింది. 9వ తేది వరకు తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించే సమస్యల క్లియరెన్స్ కాగా మిగిలిన వాటి పరిష్కారానికి ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ క్లియరెన్స్ రావాల్సి ఉంది. కేవలం తొమ్మిది రోజుల సమయం మాత్రమే ఇవ్వడం.. త్వరితగతిన క్లియరెన్స్ చేయాలని ఆదేశాలు ఉండడంతో ఈ సారి కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది హడావుడిగా పనులు కానిచ్చేసినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పై స్థాయిలో క్లియరెన్స్ కోసం ఈనెల 13వ తేది వరకు అవకాశం ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో ధరణి పెండింగ్ క్లియరెన్స్ ఈ సారైనా ఎలాంటి తప్పులూ లేకుండా పూర్తవుతుందా అన్న సందేహం నెలకొంది.

కాంగ్రెస్ గూటికి జగిత్యాల చైర్‌పర్సన్

జగిత్యాల: జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె పార్టీలో చేరగా.. ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బీసీ మహిళకు కేటాయించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని తాము తిరిగి వారికే అప్పగించామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందన్నారు. కృష్ణా జలాల కోసం ఏపీతో యుద్ధానికైనా సిద్ధమన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు చదువుల తిరుపతమ్మ, మల్లమ్మ, ఆడెపు సత్యం, సిరిపురం మహేందర్, ముకేశ్‌కన్నా కాంగ్రెస్‌లో చేరారు. 21 శాతం వేతన సవరణ చేసినందుకు ఆర్టీసీ ఉద్యోగులు ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపారు.



జ్యోతిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జీవన్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా

రాయికల్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ అన్నారు. మండలంలోని రామాజీపేటకు చెందిన బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి, మాజీ ఉపసర్పంచ్ హరీశ్‌రావు, బేతి రాజేందర్, రిటైర్డ్ ఏఈ వెంకటరామారావుతోపాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

మెట్‌పల్లి: ఈనెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కోర్టులో సోమవారం న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. కక్షిదారులు రాజీ కుదుర్చుకుని కేసులు పరిష్కరించుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఉన్నారు.

మెగా జాబ్‌మేళాలో 675 మందికి ఉద్యోగాలు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



నియామక పత్రాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే

మెట్‌పల్లి: మెగా జాబ్ మేళాలో 675మందికి ఉద్యోగాలు దక్కాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 50 కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 1400మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 675 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. ఉద్యోగాలు రాని వారు నిరుత్సాహ పడవద్దని, త్వరలో మరిన్ని జాబ్‌మేళాలు ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణ అందరి బాధ్యత



సర్వేను పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకురావాలని, వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో సోమవారం చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వేలో చేపట్టాల్సిన అంశాలను ముత్యంపేటలో ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. తెల్ల మచ్చలు, స్పర్శలేని మచ్చలు ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాడు సింహగర్జన.. నేడు కదనభేరి

- గులాబీమయమైన కరీం'నగరం'
- లక్ష మంది సమీకరణకు ఏర్పాట్లు
- నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్: దశాబ్దాలపాటు తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వరాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న నాటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ కలిసొచ్చిన కరీంనగర్ గడ్డపై నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల గ్రౌండ్‌లో లక్ష మందితో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా ×కరీంనగర్ కదనభేరి× పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల ప్రచార శంఖారావం పూరించనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అనంతరం పార్టీ అధినేత కేసీఆర్ మొదటిసారిగా కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 7న కరీంనగర్‌లో సమావేశం ఏర్పాటు చేసి సభ ఏర్పాట్లు, కాంగ్రెస్, బీజేపీల వైఖరి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ కరీంనగర్‌లోనే మకాం వేసి వారం రోజులుగా సభ ఏర్పాట్లపై కార్యకర్తలకు దిశానిర్దేశనం చేశారు.

లక్ష మంది సమీకరణకు..

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి లక్ష మందికిపైగా జనాన్ని సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, కరీంనగర్, సిరిసిల్లలో బీఆర్ఎస్ విజయం సాధించగా చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. పార్లమెంట్ పరిధిలో వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే 5వేల పైచిలుకు ఓట్లు అధికంగా వచ్చిన విషయాన్ని కార్యకర్తలకు వివరిస్తూ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 5,17,601, బీజేపీకి 2,50,400 ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ సీట్ల సంఖ్య తగ్గినా ఐదువేల పైచిలుకు మెజార్టీ బీఆర్ఎస్‌కే ఉందని, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు తథ్యమనే వాదనను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం బీఆర్ఎస్ పార్టీ చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 3 నెలలు గడిచాయని, వారు ఇచ్చిన హామీలు అమలు కాక ప్రజలు అసహనంతో ఉన్నారని, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి పెద్దగా ఏమీ లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి ఎంపీ సీట్లను బీఆర్ఎస్ కైవసం చేసుకునే దిశగా కార్యకర్తల్లో మనోనిబ్బరాన్ని నింపుతున్నారు.

కరీంనగర్ గులాబీమయం

కరీంనగర్ 'కదనభేరి' బహిరంగ సభ ఏర్పాట్లతో నగరం గులాబీమయమైంది. ప్రధాన కూడళ్లతోపాటు ఎస్సారార్ కళాశాలకు వెళ్లే రహదారి మొత్తం గులాబీ జెండాలు, పార్టీ అధినేతల కటౌట్లతో సిద్ధం చేశారు. ఎస్సారార్ మైదానంలో సభ ఏర్పాట్లకు సంబంధించి వాహనాల పార్కింగ్, తదితర పనులన్నీ పూర్తయ్యాయి.



రాజరాజేశ్వరస్వామి రథోత్సవం



రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్‌లో శ్రీరాజరాజేశ్వరస్వామి రథోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితులు అంగడి భువనేశ్వర్ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని రథంపై ప్రతిష్ఠించి శోభాయాత్ర చేపట్టారు. రాజరాజేశ్వరస్వామి శాశ్వత అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోర విజయలక్ష్మీ, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, ఆలయ కమిటీ అధ్యక్షుడు నామని శేఖర్, ప్రజాప్రతినిధులు గంగారెడ్డి, బాలె శేఖర్ పాల్గొన్నారు.



దుబ్బరాజన్నకు రుద్రాభిషేకం

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో సోమవారం ఏకాదశపూర్వక రుద్రాభిషేకాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి 11 మంది అర్చకులు స్వామివారి ఆలయంలో పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. మూడు గంటలపాటు కార్యక్రమం సాగింది. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈవో అనూష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పొరండ్ల శంకరయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల లెక్కపక్కా

- నిల్వల్లో తేడా, కొరతకు చెక్
- ప్రత్యేక దృష్టి సారిస్తున్న ప్రభుత్వం
- షాపుల్లో ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టం
- వారానికి రెండురోజులు సిబ్బంది తనిఖీలు
- డీలర్లు ఈ–పాస్ యంత్రం ద్వారా విక్రయించేలా చర్యలు
- జిల్లాలో 431 ప్రైవేట్, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల దుకాణాలు



జిల్లాలోని ఓ షాపులో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో వాణి



నిల్వలను పరిశీలిస్తున్న డీఏఓ

గొల్లపల్లి: ఎరువుల తనిఖీ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిల్వల్లో తేడా రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టం(ఫైవ్) పేరిట కొత్త యాప్‌ను వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎరువుల కొరతకు చెక్ పెట్టడమే కాకుండా నిలవలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచేందుకు ఇది తోడ్పడనుంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలను అధికారులు ఈ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులు 355, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 57, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో19 కలిపి మొత్తం 431 షాపులు ఉన్నాయి.

పక్కదారి పట్టకుండా..

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తున్న విషయం తెల్సిందే. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుంటున్న కొందరు ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. తద్వారా అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో అమ్మకాల్లో పారదర్శకత మరింత పెంచేందుకు పాయింట్ ఆఫ్ సెల్ (పీఓఎస్)విధానంలో రైతులకు ఎరువులు విక్రయించాల్సి వస్తోంది. ఈ విధానంలో రైతులు తమ ఆధార్ కార్డు, పాస్‌బుక్ సమర్పించాల్సి ఉంటుంది. రైతులు ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకాలు తీసుకురాకపోవడంతో ఎరువుల షాపు యజమానులు పీఓఎస్ మిషన్లలో సమగ్రంగా వివరాలు నమోదు చేయడం లేదు. వాస్తవంగా షాపుల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు ఉండవు. అయితే ఈ పాస్ మిషన్‌లో స్టాకు ఉన్నట్లు ఉంటుంది. దీంతో కచ్చితమైన నిల్వల వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రైవేట్ ఎరువుల డీలర్లతో పాటు టీఎస్ ఆగ్రోస్, మార్క్‌ఫెడ్ వంటి ఎరువుల పంపిణీ సంస్థలు, ప్రైవేట్ ఎరువుల వ్యాపారులు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు, పీఏసీఎస్‌ల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

సమగ్ర వివరాలు యాప్‌లో..

ఎరువుల నిల్వలను అధికారులు ధ్రువీకరించడంతోపాటు విక్రయాలు సక్రమంగా జరుగుతున్నాయా..? లేదా..? అనేది ఈ యాప్ ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ), డివిజన్ సహాయ సంచాలకులు (ఏడీఏ), మండల వ్యవసాయ అధికారి (ఏఓ) తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారులు ఆన్‌లైన్‌లో నిర్దేశించిన షాప్‌నకు వెళ్లి యాప్ ఓపెన్ చేస్తే.. ఆ దుకాణంలో ఎరువుల వివరాలు కనిపిస్తాయి. ఈపాస్ యంత్రంలో చూపించే నిల్వలతో సమానంగా స్టాక్ రిజిస్టర్, షాపులో గ్రౌండ్‌బ్యాలెన్స్ సమానంగా ఉండాలి. విక్రయించిన రైతుల వివరాలతో పాటు, స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వాటిని ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా స్టాక్ బుక్, నిలవలను పరిశీలించి తేడా ఉన్నట్లు గమనిస్తే చర్యలు తీసుకోవచ్చు. సమగ్ర వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుతుండటంతో జిల్లాలో ఎరువుల నిల్వలు, అవసరమైన ఎరువుల వివరాలు తెలుసుకోవడం సులభతరం అవుతోంది.

వారంలో రెండుసార్లు..

మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, వారానికి రెండుసార్లు 10 ఎరువుల షాపుల్లో తప్పకుండా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి కూడా ఐదు దుకాణాలను తనిఖీ చేయాలి.

తీరనున్న ఎరువుల కొరుత

కొత్తగా వచ్చిన యాప్‌ద్వారా ఎరువుల షాపుల్లో ఉండే నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు అధికారులు తెలుసుకునే వీలుంటుంది. ఎరువుల నిల్వలపై కచ్చితమైన లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. సరిపడా నిల్వలు లేకపోతే వెంటనే సరఫరాకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇక కృత్రిమ కొరత సృష్టించే ఆస్కారం ఉండదు. రైతులకు ఎరువులు లేవనే సమస్య ఉండదు.

పారదర్శకత కోసం



కొత్త యాప్‌ద్వారా ఎరువుల విక్రయాల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. నిల్వలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. కృత్రిమ కొరతకు అవకాశం ఉండదు. ఎరువుల కొరత సమస్య ఉత్పన్నం కాదు.

– కరుణ, ఏవో, గొల్లపల్లి

తేడా ఉంటే చర్యలు



ఎరువుల నిల్వల్లో తేడాలు ఉంటే ప్రత్యేక యాప్ ద్వారా తనిఖీ చేసి గుర్తించవచ్చు. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరవులు విక్రయాలు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల్లో ఎరువులను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– వాణి, జిల్లా వ్యవసాయాధికారి

భార్యతో సన్నిహితంగా ఉన్నందుకే హత్య

- హతమార్చి వేములవాడ దర్శనానికి నిందితుడు
- 48 గంటల్లోనే ఛేదించిన పోలీసులు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

రాయికల్: తన భార్యతో సన్నిహితంగా ఉన్నందుకే నాగెల్లి భూమేశ్.. సురేశ్ అనే యువకుడిని హత్య చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం జరిగిన హత్య నేరానికి సంబంధించిన వివరాలను సోమవారం రాయికల్ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన నాగెల్లి సురేశ్, నాగెల్లి భూమేశ్ వరుసకు అన్నదమ్ముల్లు. భూమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో సురేశ్ భూమేశ్ భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని స్నేహితుల ద్వారా తెలుసుకున్నాడు. ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా సురేశ్ పట్టించుకోలేదు. 2023 అక్టోబర్‌లో దుబాయ్ నుంచి ఇంటికి వస్తూనే సురేశ్‌ను చంపాలనే ఉద్దేశంతో వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా భార్యతో సన్నిహితంగా మెలగడాన్ని గమనించాడు. దీంతో సురేశ్‌పై పగ పెంచుకుని, ఎలాగైనా చంపాలని అనుకుని ఈనెల 7న ఉదయం పొలం వద్దకు నీరు పెట్టడం కోసం సురేశ్ వెళ్లడాన్ని గమనించాడు. ప్లాన్ ప్రకారం కత్తిని తీసుకుని తన ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్లాడు. పొలానికి కొద్దిదూరంలో ఉన్న చెరువు కట్టపై ద్విచక్ర వాహనాన్ని పెట్టాడు. తన పొలానికి నీరు పెట్టేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్న సురేశ్‌ను ఆపి తాను పొలానికి వస్తున్నానని చెప్పాడు. పొలం గట్టుదగ్గర ద్విచక్ర వాహనాన్ని ఆపగానే భూమేశ్ వెంట తెచ్చుకుని కత్తితో సురేశ్ తల, మెడపై విచక్షణరహితంగా నరికాడు. కిందపడిన సురేశ్ ప్రాణభయంతో బావి వైపు పరుగెత్తుతుండగా మరోసారి నుదుటిపై, తలపై కత్తితో నరికాడు. దీంతో తీవ్రంగా గాయాలైన సురేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సురేశ్ మృతదేహాన్ని అదే బావిలోకి తోసేశాడు. కత్తిని కూడా అదే బావిలో పడేశాడు. రక్తం మరకలు శుభ్రం చేసుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికొచ్చి స్నానం చేసి అనంతరం వేములవాడ రాజన్న (శివరాత్రి జాతర) దర్శనానికి వెళ్లాడు. సురేశ్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే సురేశ్ బావిలో శవమై కనిపించాడు. హత్య విషయాన్ని తెలుసుకున్న రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సురేశ్ తల్లి నాగెల్లి లక్ష్మి భూమేశ్‌పై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భూమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిచ్చిన సమాచారం మేరకు బావిలో పడేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే హత్య సమయంలో వినియోగించి రెండు మొబైల్స్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 48 గంటల్లో నిందితుడిని పట్టుకున్న సీఐ, రాయికల్ ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

నాన్న.. నాకు మాట్లాడాలని ఉంది

- మాటల కోసం తపిస్తున్న మూగ గొంతు
- ఆపరేషన్ల ఖర్చులతో అప్పులపాలైన తండ్రి
- హియరింగ్ మిషన్‌ల కొనుగోలుకు చిల్లిగవ్వ లేని వైనం
- దాతల సాయం కోసం ఎదురుచూపు



తండ్రి రాజశేఖర్‌తో రిషిత

కరీంనగర్‌టౌన్: ఆ కుటుంబంలో మొదటి సంతానంగా పాప జన్మించింది. ఇంట్లో లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడ్డారు. ఆ సంబరం ఏడాది తిరగకముందే ఆవిరైంది. పాపకు మాటలు రాకపోవడంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఆస్తులు అమ్ముకొని కొంత, దాతల సహకారంతో కొంత సొమ్ము సేకరించి కేంద్ర ప్రభుత్వ పథకంతో ఆపరేషన్ చేయించినా, లక్షల్లో ఖరీదు చేసే హియరింగ్ మిషన్ల కొనుగోలుకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాపకు మాటలు రావాలంటే మిషన్లకు, హియరింగ్ థెరపీకి రూ.11 లక్షలు అవసరముండడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కూతురు తపన.. తండ్రి ఆవేదన

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం రంగసాయిపల్లె గ్రామానికి చెందిన పోతు రాజశేఖర్, కావ్యశ్రీ దంపతులకు 2016లో రిషిత జన్మించింది. ఆరోగ్యంగానే ఉన్న పాప ఏడాది వయస్సు వచ్చినా మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి ఆసుపత్రిలో చూపించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు పాపకు పుట్టుకతోనే మూగ, చెవుడు సమస్య ఉన్నట్లు గుర్తించారు. స్పీచ్ థెరపీతో మాటలు వస్తాయని చెప్పడంతో 2017లో తిరుపతిలోని శ్రవణం స్పీచ్ థెరపీ ఆస్పత్రిలో ఏడాది పాటు ఉండి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో 2018లో దాతల సాయంతో రూ.1.5 లక్షలతో వినికిడి యంత్రం కొనుగోలు చేసినా పాపకు ఉపయోగపడలేదు. మళ్లీ 2019లో హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి వెళ్లగా ఆపరేషన్ చేస్తే నయం అవుతుందని తెలిపారు. ఆపరేషన్‌కు రూ.15 లక్షలు ఖర్చవుతాయని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కేంద్ర పథకం అడిప్ స్కీం కింద అవకాశం ఉండడంతో దరఖాస్తు చేసుకున్నారు. అడిప్ స్కీం కింద తల లోపల కాక్లర్ ఇంప్లాట్ మిషన్ వేశారు. ఆపరేషన్ చేయడం ఒక ఎత్తయితే, తర్వాత హియరింగ్ మిషన్ కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది. ఆపరేషన్ తర్వాత ప్రతీ రెండు నెలలకోసారి ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలి. ఈ క్రమంలో చెవిలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో 2022లో మరోసారి ఆపరేషన్ చేయించారు. ఓ బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసుకునే రాజశేఖర్ తరచూ బిడ్డను ఆసుపత్రులకు తీసుకెళ్తున్న క్రమంలో ఉద్యోగం కూడా పోయింది. దీంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఊళ్లో ఉన్న ఇల్లు అమ్మినా అప్పులు తీరలేదు. ప్రస్తుతం రేకుర్తిలో ఉంటున్నారు. రిషిత మాట్లాడాలంటే కుడి చెవికి రూ.7.5 లక్షల విలువైన న్యూక్లియర్–8 మిషన్, ఎడమ చెవికి రూ.1.5 లక్షల మరో మిషన్ అవసరముంది. వీటిని కొనుగోలు చేసినా ప్రతినెలా రూ.13 వేలు వెచ్చించి రెండేళ్లపాటు స్పీచ్ థెరపీ అందించాల్సి ఉంటుంది. సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేస్తే తప్ప పాప మూగ గొంతుకు మాటలు వచ్చే అవకాశం లేదు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రాజశేఖర్ కూతురు కోసం రోదిస్తున్నాడు. పాపపై కరుణతో హృదయమున్న దాతలు సహకరించాలని వేడుకుంటున్నాడు.

రాజశేఖర్‌కు సహాయం చేయాలనుకునేవారు:
అకౌంట్ నంబర్ :
2034343912
ఎస్‌బీఐ బ్యాంకు
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0014237
ఫోన్‌పే/గూగుల్‌పే నంబర్ :
77024 88503

క్లుప్తంగా

బాలిక పరిస్థితి విషమం

కోరుట్ల: జగిత్యాల జిల్లాకు చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి.. వేములవాడలోని ఓ లాడ్జిలో లైంగికదాడికి పాల్పడిన భీమారం మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన మైదం సాయికుమార్‌పై వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అత్యాచారానికి గురైన బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాలికను కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో ఉంచి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో బీపీ పడిపోయి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

బీటెక్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ విద్యార్థులు బీటెక్ ఫస్టియర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ విభాగంలో ఫయాజ్ 93శాతం, తబసుం సుల్తానా 89శాతం, కంప్యూటర్ సైన్స్‌లో నిఖిత 90శాతం, దీప్తి 89.5శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, సురేశ్, పద్మిని, ఆంజనేయులు, శ్రీనివాస్, మహేందర్, కిషన్ తదితరులు అభినందించారు.

పవర్‌లిఫ్టింగ్‌లో మగ్గిడి విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన శ్రావణి, శ్రావణ్‌కుమార్

ధర్మపురి: హైదరాబాద్‌లో ఈనెల 8, 10 తేదీల్లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. భుక్య శ్రావణి బంగారు పతకం, పుట్టుకొమ్మల శ్రావణ్‌కుమార్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చన్న, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేందర్, అధ్యాపక బృందం అభినందించారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం అమలు చేయాలి

మల్లాపూర్: బీడీ కార్మికులకు పెరుగిన కరువు భత్యం అమలు చేయాలని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.మౌలానా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్మికులకు రోజుకు కనీసం వెయ్యి బీడీల పని ఇవ్వాలని, నెలలో 26 రోజుల పనిదినాలు కల్పించాలని కోరారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.అలీ, నాయకులు గూడెల్లి రాజన్న, వడ్ల శంకుతల ఉన్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా
- అర్హులకు పథకాలు అందేలా చూడాలని ఆదేశం

జగిత్యాల: ప్రజావాణికి వచ్చి ప్రజలు అర్జీలు పెట్టుకున్న సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 47 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును పరిశీలించాలని, ముఖ్యంగా భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక సహకారం వంటి అంశాలపై అర్జీలు ఇస్తున్నారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూములు పోకుండా చూడండి



ఎన్‌హెచ్–63 గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రహదారిలో భాగంగా చేస్తున్న భూ సర్వే రద్దు చేయాలి. మేం ఉన్న భూములన్నీ కోల్పోతున్నాం. పాత అలైన్‌మెంట్ మార్చితే పరంపోగు భూములు పోతాయి. అధికారులు వాటిపై దృష్టి సారించాలి. మా భూములు పోకుండా చూడండి.

– హన్మాజీపేట రైతులు

సొసైటీ ద్వారా ధాన్యం కొనాలి



లక్ష్మీపూర్‌లో సొసైటీ ద్వారా గతంలో ధాన్యం కొనుగోలు చేశారు. దానిని నిలిపేశారు. ప్రస్తుతం సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలి. గతంలో ఎలాంటి కారణం లేకుండానే సొసైటీని రద్దు చేశారు. పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్నా.. సొసైటీ కొనేలా చూడాలి.

– పన్నాల తిరుపతిరెడ్డి, లక్ష్మీపూర్ సొసైటీ చైర్మన్

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పెగడపల్లిలో బీఆర్‌ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీమంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్యకర్తలకు సూచించారు. పెగడపల్లిలో సోమవారం లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలు, రైతుబంధు, ప్రాజెక్టుల నిర్వీర్యం, రైతులు పడుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ వైఫల్యంపై వివరించారు. దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా మారిందన్నారు. ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని పేర్కొన్నారు. కా ర్యకర్తలు, నాయకులు గ్రూపులు విడనాడి సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు రమణారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజల నిలదీస్తారు

ధర్మపురి: ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయక తప్పదని కొప్పుల అన్నారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ మండల కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. అధికార దాహంతో పరిమితికి మించి హామీలిచ్చి కాంగ్రెస్ తలలు పట్టుకుంటోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినంత మాత్రాన ధైర్యం కోల్పోవద్దని, ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్, సకాలంలో రైతుబంధు ఇచ్చామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే ప్రజలను అన్నింటిలో మోసం చేస్తున్నారని విమర్శించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునిల్ నాయకులు సొల్ల భీమయ్య మండల, పట్టణశాఖ అధ్యక్షులు మొగిలి శేఖర్, ఆకుల రాజేష్ తదితులున్నారు.

పార్టీ వదిలే వారితో నష్టం లేదు..

బుగ్గారం: పార్టీలో ఉండేవాళ్లు ఉంటారని, పోయేవారు పోతారని కొప్పుల అన్నారు. పదవులు శాశ్వతం కాదని, పార్టీ శాశ్వతమని పేర్కొన్నారు. బుగ్గారంలోని పోచమ్మ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, అదంతా కేసీఆర్ ఘనతేనని అన్నారు.

కేసీఆర్ హయాంలోనే జలకళ

గొల్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా జలకళ కనిపించిందని, కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణలోని 46వేల చెరువులను మరమ్మతు చేయించడంతోపాటు వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించారని కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలకేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఎంపీ ఎన్నికలలో కార్యకర్తలు సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. నాయకులు గోస్కుల జలందర్, నక్క శంకరయ్య, రాజసుమన్‌రావు, వెంకటమాధవ్, ఆవుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ‘అల్ఫోర్స్ అస్త్ర’



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్ రెడ్డి, పోటీ పరీక్షల శిక్షకురాలు బాలలత



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): అల్ఫోర్స్ అస్త్ర పేరిట సోమవారం రాత్రి రేకుర్తి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కరీంనగర్‌లోని భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల వార్షికోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి ముఖ్య అతిథి, ప్రముఖ పోటీ పరీక్షల శిక్షకురాలు ఎం.బాలలతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొంటూ అనుకున్న లక్ష్యాలను సాధించి, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్య దశ నుంచే విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.